# సాక్షి
# నిర్మల్

మంగళవారం । 16 । మే । 2023






**నేటి నుంచి 'దోస్త్'**
2023-24 విద్యాసంవత్సరంలో డిగ్రీలో ప్రవేశానికి చేపట్టే (డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ) దోస్త్ ప్రక్రియ మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. 8లో▸



**వామ్మో చిరుత** 10లో▸
మహారాష్ట్ర సరిహద్దు మండలాలైన తానూర్, కుభీర్ మండలాల్లోని గ్రామాల్లో చిరుత పులి సంచరిస్తోంది. ప్రజలను ఏడాది కాలంగా చిరుత భయపెడుతోంది.

గరిష్ఠం/కనిష్ఠం
41.8/28.6

**వాతావరణం**
ఆకాశంలో అక్కడక్కడా మబ్బులు ఉంటాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వేడి అధికంగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి. పొద్దంతా ఉక్కపోతగా ఉంటుంది.

## న్యూస్‌రీల్

### విద్యాశాఖ మంత్రిని కలిసిన ఆర్జీయూకేటీ ఇన్‌చార్జి వీసీ



మంత్రికి మొక్క అందిస్తున్న వెంకటరమణ

భైంసా: బాసర ఆర్జీయూకేటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డిని సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవలే విదేశీ పర్యటనకు వెళ్లొచ్చిన వెంకటరమణ మంత్రిని కలిసి అక్కడి విశ్వవిద్యాలయాలు, విద్యా విధానం, ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై అనుసరిస్తున్న విధానాలను వివరించారు. ఆర్జీయూకేటీలో చదివి విదేశాల్లో ఉన్నతవిద్య అభ్యసిస్తున్న విద్యార్థులను కలిసి, వారి నుంచి ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులకు సహాయ సహకారాలు, తదితర అంశాలపై చర్చించినట్లు తెలిపారు, తర్వాత విద్యాశాఖ కార్యదర్శితో సమావేశమై ఆర్జీయూకేటీ భవిష్యత్తు ప్రణాళిక, అకడమిక్, పరిపాలన సంబంధిత నిర్ణయాలపై చర్చించారు.

### బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ కమిషనర్



బాధ్యతలు స్వీకరిస్తున్న మనోహర్

ఖానాపూర్: ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్‌గా టి.మనోహర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు కమిషనర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహించిన పెంబి ఎంపీవో రత్నాకర్‌రావు స్థానంలో మనోహర్ విధుల్లో చేరారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మున్సిపాలిటీలో రెవెన్యూ అధికారిగా విధులు నిర్వహించి బదిలీపై ఖానాపూర్‌కు వచ్చారు.

### సీఎమ్మార్ త్వరగా అందించాలి



గోదాంను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

లోకేశ్వరం: మిల్లర్లు సీఎమ్మార్ త్వరగా అప్పగించాలని అదనపు కలెక్టర్ రాంబాబు సూచించారు. మండలంలోని నగర్ గ్రామ శివారులోని గోదాంను సోమవారం పరిశీలించారు. ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ సరిత ఉన్నారు.

### సాధారణ ప్రసవాలపై దృష్టిపెట్టాలి



రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

భైంసాటౌన్: ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలపై దృష్టి సారించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో రాజేందర్ సూచించారు. భైంసాలోని దత్త సాయి ఆస్పత్రిలో సోమవారం తనిఖీలు నిర్వహించారు. రికార్డులు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. మొదటికాన్పు తప్పనిసరిగా సాధారణ ప్రసవం చేయాలని ఆదేశించారు. రికార్డులు సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీనివాస్ ఉన్నారు.

### డెంగీ నివారణకు చర్యలు చేపట్టాలి



పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్:జిల్లాలో డెంగీ ప్రబలకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి వైద్యాధికారులకు సూచించారు. మంగళవారం జాతీయ డెంగీ నివారణ దినం సందర్భంగా సోమవారం కరపత్రాలు, ఫ్లెక్సీ విడుదల చేశారు. అనంతరం వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రాజేందర్, కార్యక్రమ నిర్వహణ అధికారులు రాజారమేష్, శ్రీనివాస్, డిప్యూటీ జిల్లా విస్తరణ, మీడియా అధికారి రవీందర్ పాల్గొన్నారు.




# ఎండ.. ప్రచండ

- జిల్లాలో భగ్గుమంటున్న భానుడు
- 44 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రతలు
- వేడి, వడగాలులకు అల్లాడుతున్న ప్రజలు
- జాగ్రత్తగా ఉండాలంటున్న వైద్యులు

నిర్మల్:జిల్లాలో ఎండ ప్రచండ రూపం దాలుస్తోంది. ఉదయం 8 గంటలకే భానుడు మండిపోతున్నాడు. పగలు అడుగు బయట పెట్టలేని పరిస్థితి. సాయంత్రం ఏడు దాటినా వేడి తగ్గడం లేదు. జిల్లాలో మూడు రోజులుగా 44 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదవుతోంది. మధ్యాహ్నం 45 డిగ్రీల సెల్సియస్ దాటుతోందా.. అన్నట్లు సూర్యుడు మండిపోతున్నాడు. రోడ్లన్నీ ఖాళీగా మారుతున్నాయి. తప్పనిసరి పరిస్థితుల్లో పగటిపూట బయటకు వెళ్లి, ఎండలో తిరిగిన వాళ్లు అస్వస్థతకు లోనవుతున్నారు. ఎండలకు వడగాలి తోడుకావడంతో చాలామంది అస్వస్థతకు గురవుతున్నారు.

**అత్యధిక ఉష్ణోగ్రతలు..**
జిల్లాలో సహజంగా మే నెలలో 42-43 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదవుతుంటాయి. ఈసారి 44-45 డిగ్రీల సెల్సియస్ వరకూ వెళ్తున్నాయి. రెండేళ్లుగా వర్షాలతోపాటు ఎండలూ దంచుతున్నాయి. వారంరోజులుగా 42 డిగ్రీలకు తగ్గకుండా సూర్యుడు ప్రతాపం చూపుతున్నాడు. ఎండతోపాటు మధ్యాహ్నం పూట వేడిగాలి వీస్తుండటం మరింత ఇబ్బంది పెడుతోంది. ఒక్కోసారి అనూహ్యంగా చల్లబడుతూ మళ్లీ వెంటనే ఎండ తీవ్రత పెరుగుతోంది. ఇలా వాతావరణంలో వస్తున్న మార్పులు కూడా అస్వస్థతకు గురిచేస్తున్నాయి. వృద్ధులు, పిల్లలు ఇంట్లో ఉన్నా.. వేడికి ఇబ్బంది పడుతున్నారు.

**పెళ్లిళ్లకూ దూరం..**
'అరె పెద్దోడా.. ఆదిలాబాద్‌లో అత్తమ్మ కొడుకుది పెండ్లి ఉన్నది జర పోయిరారా.. మనకు బాగా దగ్గరోళ్లరా. ఎండలు బాగా ఉన్నయ్ లేదంటే నేనే పోతుంటిరా..'అని తండ్రి చెబితే.. 'బాపు.. ఎండలు మామూలుగ లేవు. ఆదిలాబాద్‌ల మనకంటే ఎక్కువ ఎండలున్నయ్. పెండ్లికి పోవుడు నాతోని కూడా కాదు. ఎల్లుండి సాయంత్రం నిర్మల్లనే రిసెప్షన్‌కు పోదాం..'అంటూ కొడుకు సమాధానమిచ్చాడు. ఇలా ఎండదెబ్బకు భయపడి చాలామంది పెళ్లిళ్లు, శుభకార్యాలకు వెళ్లడానికీ జంకుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో వెళ్లినా.. మధ్యాహ్నమంతా ఫంక్షన్‌హాల్‌లోనే ఉండి, సాయంత్రం చల్లబడ్డాక ఇళ్లకు బయల్దేరుతున్నారు.

**వడ.. దడ..**
జిల్లా ఆస్పత్రితోపాటు ప్రైవేటు ఆస్పత్రుల్లో ప్రస్తుతం చికిత్స కోసం వస్తున్నవారిలో అధిక శాతం ఎండతో అస్వస్థతకు గురైనవారే కనిపిస్తున్నారు. వడదెబ్బ తగలడంతో పరిస్థితి సీరియస్‌గా మారినవారూ ఉంటున్నారు. సకాలంలో వైద్యం అందుతుండటంతో బతుకుతున్నారే తప్పా.. లేదంటే వడదెబ్బకు ప్రాణాలూ పోయే ప్రమాదముందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఆస్పత్రికి వస్తున్నవారిలో రోజంతా ఎండలో ఉంటున్నవారే ఎక్కువగా ఉంటున్నారని వైద్యులు చెబుతున్నారు.

**జాగ్రత్తలు తీసుకోవాలి..**



ప్రస్తుతం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎండలో తిరగడం అంత మంచిది కాదు. తప్పనిసరి పరిస్థితుల్లో వెళ్తే ఎండ తగలకుండా చూసుకోవాలి. తరచూ నీళ్లు తాగుతూ ఉండాలి. వడదెబ్బకు గురైతే వెంటనే వైద్యున్ని సంప్రదించాలి.
– డాక్టర్ బి.రవి, ఎండీ, నిర్మల్



గొడుగు నీడన చిరు వ్యాపారం..



స్కార్ఫ్ కట్టుకుని మధ్యాహ్నం ప్రయాణం..

### వడదెబ్బతో వీవోఏకు అస్వస్థత



ఖానాపూర్‌లో 27వ రోజు దీక్షలో పాల్గొన్న వీవోఏలు



అస్వస్థతకు గురైన కలిరామ్

ఖానాపూర్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట 27 రోజులుగా వీవోఏలు నిరవధిక దీక్షలు చేస్తున్నారు. సోమవారం వీవోఏ కలిరామ్ వడదెబ్బతో అస్వస్థతకు గురయ్యాడు. 20 రోజులు ఎంపీడీవో కార్యాలయాల ఎదుట దీక్ష చేసిన వీవోఏలు వారం రోజులుగా నియోజకవర్గ కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మె కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం దస్తురాబాద్ మండలం ఎర్రకుంట గ్రామానికి చెందిన వీవోఏ కలిరామ్ ఖానాపూర్‌లో దీక్ష శిబిరానికి వస్తుండగా అస్వస్థతకు గురయ్యాడు. దీంతో స్థానికులు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

### గవర్నర్‌కు వినతి



గవర్నర్‌కు వినతిపత్రం ఇచ్చిన గజేందర్

కుంటాల: నిజామాబాద్ జిల్లాలోని తెలంగాణ యూనివర్సిటీ సమస్యలను పరిష్కరించాలని వర్సిటీలో న్యాయశాస్త్రం చదువుతున్న జక్కుల గజేందర్ రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను సోమవారం కలిశారు. సమస్యలపై వినతిపత్ర అందించారు. యూనివర్సిటీలో సమస్యలు పరిష్కరించకపోవడంతో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని పేర్కొన్నారు. గవర్నర్ సానుకూలంగా స్పందించినట్లు గజేందర్ పేర్కొన్నారు.

## బ్రిజ్ భూషణ్‌ను కఠినంగా శిక్షించాలి

- సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా ఆధ్వర్యంలో నిరసన

నిర్మల్‌చైన్‌గేట్:రెజ్లింగ్ క్రీడాకారిణులపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్‌సింగ్‌ను వెంటనే పదవి నుంచి తప్పించాలని, చట్టపరంగా శిక్షించాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా ఉమ్మడి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గాంధీపార్క్‌లో గాంధీ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి నంది రామయ్య మాట్లాడుతూ భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడిగా కొనసాగుతున్న బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌పై గతంలోనే అనేక కేసులు, ఫిర్యాదులు ఉన్నాయని తెలిపారు. అయినా కేంద్రం బ్రిజ్ భూషణ్‌ను వెనుకేసుకురావడంతో మహిళా క్రీడాకారులపై ఆగడాలు పెరిగాయని పేర్కొన్నారు. రెజ్లింగ్ క్రీడాకారులు ఒలింపిక్స్, ప్రపంచకప్ మొదలగు పోటీల్లో భారతదేశానికి పతకాలు తీసుకొచ్చినప్పుడు తమ ప్రభుత్వ గొప్పగా చెప్పుకొని, క్రీడాకారులతో ఫొటోలు దిగిన ప్రధాని, క్రీడా మంత్రులు ఇప్పుడు మొహం చాటేయడం అనైతికమన్నారు. ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి కె.లక్ష్మి మాట్లాడుతూ ఒకవైపు బేటీ పఢావో, బేటీ బచావో అని చెప్తున్న ప్రధాని మోదీ మహిళా క్రీడాకారులు దేశ రాజధానిలో నిరసన తెలుపుతున్నా స్పందించక పోవడం సరికాదన్నారు. ప్రధాని వైఖరి మహిళలను వేధించేవారిని కాపాడేలా ఉందని పేర్కొన్నారు. నిరసన కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కె.రాజన్న, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.బక్కన్న, ఆర్.రామలక్ష్మణ్, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.గంగన్న, జిల్లా కోశాధికారి ఎండీ.గఫూర్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మహేందర్, నవీన్, నాయకులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న నాయకులు

**ఎంపీని అరెస్ట్ చేయాలి..**
ఖానాపూర్: మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న బీజేపీ బ్రిజ్ భూషణ్‌ను అరెస్ట్ చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సునారికారి రాజేశ్ డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టీయూ జాతీయ కమిటీ పిలుపు మేరకు పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో సోమవారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు భూక్య విలాస్, జిల్లా కోశాధికారి దుర్గం లింగన్న, నాయకులు చిన్నరాజన్న, సంతోష్, వెంకటేశ్, తదితరులు ఉన్నారు.

## ఆటలతో మానసిక ఉల్లాసం

- మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి
- మండలస్థాయి సీఎం కప్ పోటీలు ప్రారంభం



మాట్లాడుతున్న మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్ రూరల్: ఆటలతో విద్యార్థులు, యువతలో మానసిక ఉత్తేజం కలుగుతుందని, ప్రతీరోజు ఆటలు ఆడాలని దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. మండలంలోని వెంగ్వాపేట్ గ్రామంలో మండలస్థాయి సీఎం కప్ పోటీలను కలెక్టర్ వరుణ్‌రెడ్డితో కలిసి సోమవారం ప్రారంభించారు. నూతన జిల్లాలు ఏర్పడిన తర్వాత అభివృద్ధి వేగంగా జరుగుతుందన్నారు. మూడు రోజులపాటు ఈ పోటీలు జరుగుతాయని తెలిపారు. మండలస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారు జిల్లాస్థాయిలో ఆడతారని, జిల్లాస్థాయిలో ప్రతిభ కనబర్చినవారు రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని వివరించారు. మండల స్థాయి విజేతలకు రూ.15 వేల నగదు, జిల్లాస్థాయి విజేతలకు రూ.75 వేల నగదు బహుమతి ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగయ్య, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, పీఈటీలు, వివిధ ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



కుభీర్‌లో పరుగు పందేనికి సిద్ధంగా ఉన్న క్రీడాకారులు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జెడ్పీ సీఈవో

**క్రీడలతో మానసిక, శారీరక వికాసం**
సోన్: క్రీడలు మానసిక, శారీరక వికాసానికి దోహదపడతాయని జెడ్పీ సీఈవో సుధీర్‌కుమార్ అన్నారు. సీఎం కప్ మండలస్థాయి క్రీడలను సోమవారం ప్రారంభించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. 15 నుంచి 36 ఏళ్లలోపు క్రీడాకారులు అర్హులని తెలిపారు. మూడు రోజులపాటు నిర్వహించే పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులను జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ హిమబిందు, ఎంపీపీ బర్ల మానస, ఎంపీవో ఖలీల్, సీఐ నవీన్‌కుమార్, ఎస్సై రవీందర్, వివిధ గ్రామాల కార్యదర్శులు, పీడీలు పాల్గొన్నారు.

## ప్రజావాణికి వినతుల వెల్లువ



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్



కలెక్టర్ రాక కోసం వేచి చూస్తున్న జిల్లా అధికారులు

- అర్జీలు స్వీకరించిన కలెక్టర్
- పరిష్కారానికి ఆదేశాలు

నిర్మల్‌చైన్‌గేట్:ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణికి వినతులు వెల్లువెత్తాయి. కలెక్టర్ వరుణ్‌రెడ్డి, అదనపు కలెక్టర్ రాంబాబుతో కలిసి అర్జీలు స్వీకరించారు. వినతులను సంబంధింత శాఖల అధికారులకు అందించి త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు.

**41 దరఖాస్తులు...**
ప్రజావాణికి 41 దరఖాస్తులు రాగా.. రెవెన్యూకు సంబంధించి 21, ఇతర శాఖలకు సంబంధించినవి 20 దరఖాస్తులు వచ్చాయి. ఎక్కువగా పెన్షన్లు, ఉపాధి కల్పించాలని, ధరణి సమస్యపైనే వినతులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

**రైతుబంధు రావడం లేదు**
సారంగాపూర్ మండలం జామ్ గ్రామానికి చెందిన కొట్ల మల్లయ్య తనకు గ్రామంలోని 1730/1 సర్వే నంబర్‌లో ఎకరం భూమి ఉందని తెలిపాడు. ధరణిలో తన భూమి వివరాలు చూపించడం లేదని పేర్కొన్నారు. రెండేళ్లుగా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదని తెలిపారు. ఆన్‌లైన్‌లో భూమి వివరాలు లేకపోవడంతో రైతుబంధు రావడం లేదని పేర్కొన్నారు. తన సమస్య పరిష్కరించాలని కలెక్టర్‌ను కోరాడు.

**99 నిమిషాలు ఆలస్యంగా ప్రారంభం**
నిర్మల్‌చైన్‌గేట్: ఉదయం 10:30 గంటలకు ప్రారంభం కావాల్సిన ప్రజావాణి మధ్యాహ్నం 12:09 గంటలకు మొదలు పెట్టలేదు. కలెక్టర్ 99 నిమిషాలు ఆలస్యంగా వచ్చారు. ఆయన వచ్చే వరకూ ఎవరూ అర్జీలు స్వీకరించలేదు. దీంతో దూరం నుంచి వచ్చిన అర్జీదారులు కలెక్టరేట్ ఆవరణలో నిరీక్షించారు. కలెక్టర్ రాకున్నా.. అధికారులు అర్జీలు స్వీకరించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## 'ఎవరెస్ట్' ఎక్కిన సీఏకు సన్మానం



సాయిప్రసాద్‌ను సన్మానిస్తున్న సైక్లింగ్‌క్లబ్ సభ్యులు



సన్మానిస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

నిర్మల్:జిల్లా కేంద్రానికి చెందిన చార్టెడ్ అకౌంటెంట్ సాయిప్రసాద్ ఎవరెస్ట్ బేస్‌క్యాంప్ వరకు ఎక్కడం జిల్లాకే గర్వకారణమని, నేటి విద్యార్థులు, యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని డీఎస్పీ జీవన్ రెడ్డి అన్నారు. సీఏ సాయిప్రసాద్‌ను సోమవారం డీఎస్పీ కార్యాలయంలో ప్రత్యేకంగా సన్మానించారు. ఈసందర్భంగా సాయిప్రసాద్ ఎవరెస్ట్ అధిరోహించిన తీరును తెలుసుకుని అభినందించారు.

**'సైక్లింగ్‌క్లబ్'.. ప్రోత్సాహం**
'నేను ఎవరెస్ట్ బేస్‌క్యాంప్ వరకు వెళ్లడానికి నిర్మల్ సైక్లింగ్ క్లబ్ చాలా ప్రోత్సహించింది. వారి ప్రోత్సాహంతోనే చివరి వరకూ చేరుకోగలిగాను..' అని సీఏ సాయిప్రసాద్ అన్నారు. నిర్మల్ సైక్లింగ్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం సాయిప్రసాద్‌ను సన్మానించారు. నేటి యువత ఫిట్‌నెస్‌తో ఉండాలన్న మా ఉద్దేశాన్ని సాయిప్రసాద్ ఎవరెస్ట్ స్థాయికి తీసుకెళ్లారని కొనియాడారు. ఆయనను అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఇందులో సైక్లింగ్ క్లబ్ సభ్యులు, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ రామకృష్ణ, వైద్యులు బీఎల్ఎన్‌రెడ్డి, రఘునందన్‌రెడ్డి, రాంచందర్‌రెడ్డి, సభ్యులు రాకేశ్‌రెడ్డి, భిక్షపతి, రేవంత్, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### అండర్- 19 జట్టులో విష్ణుసాయితేజకి చోటు


విష్ణుసాయితేజ

నిర్మల్‌ఖైన్‌గేట్: నేషనల్ చాంపియన్ షిప్ టి–20 క్రికెట్ కప్ అండర్ 19 విభాగంలో తెలంగాణ జట్టులో ఆడేందుకు నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలానికి చెందిన బి.శ్రీనివాస్, నిర్మలజ్యోతి దంపతుల కుమారుడు బి.విష్ణుసాయితేజ ఎంపికయ్యాడు. ఈ నెల 17 నుంచి 19 వరకు ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో జరిగే మ్యాచ్‌లో ఆడనున్నారు. ఈ సందర్భంగా విష్ణు సాయితేజని పలువురు అభినందించారు.

### ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

**ఉట్నూర్‌రూరల్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పీవీటీజీ విద్యార్థుల కోసం హైదరాబాద్‌లోని హయాత్‌నగర్‌లోని జూనియర్ కళాశాలలో 2023- 24 విద్యాసంవత్సరానికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పదో తరగతి పాసైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఆర్‌సీవో గంగాధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపుల్లో 40మంది చొప్పున ప్రవేశాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఉచిత విద్య, వసతితో పాటు జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్, నీట్, ఎంసెట్ కోచింగ్ సీఎంఏ, సీఎల్ఏటీ కోచింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు పూర్తి వివరాలతో బాలుర కళాశాల హయత్‌నగర్ ప్రిన్సిపాల్ 9440398993, బాలికల కళాశాల హయాత్‌నగర్ ప్రిన్సిపాల్ నం. 96408 53914కు వాట్సాప్‌ల్లో పంపించాలని తెలిపారు.

### టేకు చెట్లు నరికిన నిందితుల రిమాండ్


నిందితులతో ఫారెస్ట్ సిబ్బంది

పెంబి: పెంబి రేంజ్, తాటిగూడ సెక్షన్, పులగంపాండ్రి పరిధిలోని పది రోజుల క్రితం బేస్ క్యాంపు సిబ్బంది సాయంతో గుండాల గ్రామానికి చెందిన తొమ్మిది మంది 22 టేకు చెట్లను నరికిన విషయం తెలిసిందే. బేస్ క్యాంపు సిబ్బందిలోని ఒకరు, చెట్టు నరికిన నలుగురిని నిర్మల్ కోర్టులో సోమవారం హాజరుపరిచారు. నిందితులకు 12రోజుల రిమాండ్ విధించినట్లు ఎఫ్ఆర్‌వో రామకృష్ణ తెలిపారు. పరారీలోని మరో నలుగురు నిందితులను త్వరలోనే పట్టుకుని కోర్టులో హాజరు పర్చుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెంబి రేంజ్ సిబ్బంది ఉన్నారు.

### మహిళ ఆత్మహత్య

**చింతలమానెపల్లి(సిర్పూర్):** పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని డబ్బా గ్రామ పంచాయతీ పరిధిలోని బారెగూడకు చెందిన గుర్లె చిన్నుబాయి(50) కొంతకాలంగా మద్యానికి బానిసైంది. సోమవారం మద్యం మత్తులో ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.





# నేటి నుంచి దోస్త్

- డిగ్రీలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్
- ఈ నెల 20 నుంచి వెబ్ ఆప్షన్లు
- మూడు విడతలుగా ప్రక్రియ
- జూలై 17 నుంచి తరగతులు ప్రారంభం

**మంచిర్యాలఅర్బన్/బోథ్: 2023-24 విద్యాసంవత్సరంలో డిగ్రీలో ప్రవేశానికి చేపట్టే (డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ) దోస్త్ ప్రక్రియ మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. విద్యార్థులకు ఇష్టమైన కళాశాల, నచ్చిన కోర్సు ఎంచుకునేందుకు వీలు కల్పించారు. ప్రవేశ ప్రక్రియ మూడు విడతలుగా జరుగనుంది. ఈ మేరకు రాష్ట్ర ఉన్నత మండలి చైర్మన్, కళాశాల విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిత్తల్ దోస్త్ నోటిఫికేషన్, ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ వివరాలు ప్రకటించారు. మే 16 నుంచి జూన్ 10 వరకు మొదటి విడత రిజిస్ట్రేషన్లు షురూ కానున్నాయి.**

**ఉమ్మడి జిల్లాలో ఇలా..**

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలలు 137 ఉన్నాయి. ఇటీవల విడుదలైన ఇంటర్ ద్వితీయ సంవత్సరం జనరల్, ఒకేషనల్ ఫలితాల్లో ఆదిలాబాద్ జిల్లాలో 6,470 మంది, మంచిర్యాల జిల్లాలో 4,656 మంది, నిర్మల్ జిల్లాలో 3,979 మంది, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 3,973 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఒక్కో కళాశాలలో ఒక్కో కోర్సుకు 60 మంది విద్యార్థులకు అవకాశం ఉంటుంది. బీఏ, బీకామ్, బీఎస్సీ, బీబీఎం, కంప్యూటర్ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈసారి రాష్ట్రంలోని 11 కళాశాలల్లో కొత్తగా బీఎస్సీ ఆనర్స్ ఇన్ కంప్యూటర్ సైన్స్ పేరిట నాలుగేళ్ల కోర్సు ప్రారంభిస్తున్నట్లు విద్యాశాఖ అధికారులు ప్రకటించారు. ఏయే కళాశాలల్లో కొత్త కోర్సుకు అనుమతి ఉంటుందో దోస్త్ ప్రక్రియ ప్రారంభమైతేగానీ తెలియని పరిస్థితి.

**ఇంట్లో నుంచే దరఖాస్తు**

డిగ్రీలో ప్రవేశం పొందగోరే విద్యార్థి ఇంట్లో నుంచే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఆధార్ అనుసంధానం చేసిన స్మార్ట్‌ఫోన్ ఉంటే దానితో నేరుగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. అలా కుదరనిపక్షంలో తల్లిదండ్రుల ఫోన్లకు విద్యార్థి తన ఆధార్‌ను అనుసంధానించి ప్రక్రియను కొనసాగించే అవకాశం కల్పించారు. ఆధార్‌కు మొబైల్ నంబర్ అనుసంధానమై ఉంటే విద్యార్థి ఇంట్లో కూర్చునే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. టీయాప్ ఫోలియో మొబైల్ యాప్ ద్వారా సులువుగా రిజిస్టర్ చేసుకునే సదుపాయం కల్పించారు. వివరాలు పూర్తి చేసిన తర్వాత విద్యార్థి సెల్‌ఫోన్‌కు ఓటీపీ (వన్‌టైం పాస్‌వర్డ్) సమాచారం వస్తుంది.

**సీట్లు భర్తీ అయ్యేనా?**

గతేడాది ఐదు విడతలుగా కౌన్సెలింగ్ నిర్వహించినా సగానికి పైగా సీట్లు భర్తీ కానీ గడ్డు పరిస్థితి. ప్రభుత్వ కళాశాలల్లో కాస్త మెరుగ్గా ఉన్నా ప్రైవేట్ కళాశాలల్లో సీట్లు మిగిలిపోవడం నిరాశ పరిచింది. నాలుగు ప్రభుత్వ కళాశాలల్లో 1,920 సీట్లకుగానూ 807 సీట్లు మిగిలిపోయాయి. జిల్లాలో డిగ్రీ ప్రవేశాల సంఖ్య తగ్గడానికి ఇంటర్ ఉత్తీర్ణత శాతం తగ్గిపోవడం కారణమైతే.. విద్యార్థులకు హైదరాబాద్ నగరంపై మోజు ఉండడం మరో కారణం. ఒకప్పుడు ఇంజినీరింగ్ విద్య కోసం రాష్ట్ర రాజధానిపై ఆసక్తి కనబర్చి బీటెక్ కోర్సులు అక్కడ చదవడం ప్రారంభించారు. మరోవైపు వసతితో కూడిన విద్య అమలు చేస్తుండడంతో గురుకులాల్లో కూడా డిగ్రీ ప్రవేశపెట్టడంతో కూడా కొంతమేర ప్రవేశాలు తగ్గినట్లు చెబుతున్నారు. ప్రైవేట్‌లో 40శాతం సీట్లు కూడా భర్తీకాని పరిస్థితి ఏర్పడింది. దోస్త్ వచ్చిన తర్వాత విద్యార్థులు హైదరాబాద్, కరీంనగర్, వరంగల్ కళాశాలల్లో దరఖాస్తు చేసుకోవడం చాలా తేలికైంది. మరోవైపు అవసరానికి మించి కోర్సులు.. సీట్లు ఉన్నాయి. ప్రధానంగా ప్రైవేట్‌లో అత్యధికంగా ఇలాంటివే. ఒకరిని చూసి మరొకరు అన్నట్లు సీట్లను పెంచుకుంటూ వచ్చారు. దీంతో సీట్లు భర్తీకాక డిగ్రీ కళాశాలల నిర్వహణ కష్టతరంగా మారుతోంది. మంచిర్యాల జిల్లాలో 22 కళాశాలల్లో ఒకటి, రెండు మూసివేయాలని ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది.

**దరఖాస్తు విధానం**

దోస్త్‌లో విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకునే సమయంలో పదోతరగతి, ఇంటర్ మెమోలు, 1 నుంచి పదోతరగతి వరకు బోనఫైడ్, కండక్ట్ సర్టిఫికెట్లు, పాస్‌పోర్టుసైజ్ ఫొటో, ఆధార్‌కార్డు, ఆధార్ అనుసంధానం సెల్‌నంబర్, ఈ ఏడాది తీసుకున్న కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలి. ఒకటి లేదా అంతకంటే ఎక్కువ కళాశాలలు, కోర్సుల్లో ప్రవేశానికి నమోదు చేసుకోవడానికి మొదటి విడతలో రూ.200 చెల్లించాలి. క్రెడిట్, డెబిట్ కార్డు, నెట్ బ్యాంకింగ్, టీవ్యాలెట్ ద్వారా చెల్లించవచ్చు.

**మూడు విడతలుగా...**

మొదటి విడత ఈ నెల16 నుంచి జూన్ 10వరకు రిజిస్ట్రేషన్, ఈ నెల 20 నుంచి వెబ్ ఆప్షన్ల నమోదు, జూన్ 16న సీట్ల కేటాయింపు, 16నుంచి 25 వరకు సెల్ఫ్ రిపోర్టుకు అవకాశం ఉంటుంది. రెండో విడత జూన్ 16 నుంచి 26 వరకు రిజిస్ట్రేషన్, వెబ్‌ఆప్షన్లు, 30న సీట్ల కేటాయింపు ఉంటుంది. మూడో విడత జూలై 1నుంచి 5 వరకు రిజిస్ట్రేషన్, 1నుంచి 6వరకు వెబ్‌ఆప్షన్ల నమోదు, 10న సీట్ల కేటాయింపు ఉంటుంది.

### సాంకేతికతతో కేసుల పరిష్కారం

- టూటౌన్ సీఐ పురుషోత్తంచారి


బాధితురాలికి బ్యాగు అందిస్తున్న సీఐ పురుషోత్తంచారి

**ఆదిలాబాద్‌టౌన్:** సాంకేతిక పరిజ్ఞానంతో కేసులను త్వరితగతి పరిష్కరిస్తున్నట్లు టూటౌన్ సీఐ పురుషోత్తంచారి అన్నారు. ఇంద్రవెల్లికి చెందిన గేడం లత ఈ నెల 14న హైదరాబాద్ నుంచి కృష్ణ ఎక్స్‌ప్రెస్ రైల్లో ఆదిలాబాద్‌కు చేరుకుంది. రైల్వేస్టేషన్ నుంచి బస్టాండ్‌కు వచ్చిన ఆమె ఆటోలో తన బ్యాగును మరిచిపోయింది. ఈ విషయమై టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సీఐ పురుషోత్తం, ఏఎస్సై సిరాజ్, బ్లూకోర్టు అధికారి రమణయ్య, రమేష్‌లు కలిసి సీసీ ఫుటేజ్ ఆధారంగా ఆటోను గుర్తించారు. ఆ బ్యాగును రికవరీ చేసి సోమవారం బాధితురాలికి సీఐ అందజేశారు. అందులో రూ.20వేల నగదు, పుస్తెల తాడు, చెవి గున్నలు ఉన్నాయి. తన బ్యాగును అందించిన పోలీసులకు ఆమె కృతజ్ఞతలు తెలిపింది. అదే విధంగా ఆదివారం ఉదయం పట్టణంలోని కరాచీ బేకరీ సమీపంలోని ఎస్‌బీఐ ఏటీఎంలో డబ్బులకు వెళ్లిన కానిస్టేబుల్ అందులో రూ.9వేలు ముందుగానే వచ్చినట్లు గుర్తించాడు. ఏటీఎం డబ్బులు డ్రా చేసిన వారు ఆధారాలు చూపిస్తే వారికి ఆ డబ్బులు అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలు ఫిర్యాదులు ఉంటే నేరుగా పోలీసులను సంప్రదించాలని సూచించారు. పోలీసులు అన్ని వేళల్లో అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.

## ప్రజలతో సత్సంబంధాలు పెంచుకోవాలి


ఎస్పీకి స్వాగతం పలుకుతున్న డీఎస్పీ, సీఐ, ఎస్సైలు

- ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

**ఉట్నూర్‌రూరల్:** వార్షిక తనిఖీల్లో భాగంగా సోమవారం ఉట్నూర్ పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి తనిఖీ చేశారు. ఎస్పీకి ఉట్నూర్ డీఎస్పీ సీహెచ్ నాగేందర్, సీఐ సైదారావు పుష్పగుచ్ఛం అందించి ఆహ్వానించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్క నాటారు. సిబ్బంది మాట్లాడి నిర్వహిస్తున్న విధులను అడిగి తెలుసుకున్నారు. రిసెప్షన్ సెంటర్ పరిశీలించి ఫిర్యాదుదారులతో గౌరవంగా వ్యవహరించాలని సూచించారు. ప్రతీ ఒక్క ఫిర్యాదు దారుని పిటిషన్ వెంటనే నమోదు, సమస్య పరిష్కారానికి కృషి చేయాలని అధికారులకు సూచించారు. సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించినప్పుడే ప్రజల్లో పోలీసులపై నమ్మకం పెరగుతుందని తెలిపారు. సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసే విధంగా ప్రజలను ప్రోత్సహించాలని తెలిపారు. అదేవిధంగా పోలీస్‌స్టేషన్ ఆవరణలో నిర్వహిస్తున్న సర్కిల్ కార్యాలయాన్ని, ఉట్నూర్ రెండవ ఎస్సై కార్యాలయాన్ని రనోవేషన్ చేసి పునఃప్రారంభించారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. ఇందులో ఉట్నూర్ ఎస్సై భరత్ సుమన్ ఉన్నారు.

## సమస్యల పరిష్కారానికి చర్యలు


అర్జీలు స్వీకరిస్తున్న ఐటీడీఏ ఏపీవో కనక భీంరావు

- ఐటీడీఏ ఏపీవో కనక భీంరావు

**ఉట్నూర్‌రూరల్:** గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ఏపీవో కనక భీంరావు అన్నారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనులు అర్జీలు సమర్పించారు. కొలాంగూడకు చెందిన లలిత ఏఎన్ఎం ఉద్యోగం ఇప్పించాలని, గాదిగూడ మండలం రాంపూర్ గ్రామస్తులు తమకు గిరి వికాసం పథకం కింద బోరుబావులు, విద్యుత్ మోటార్లను మంజూరు చేయాలని, లింగాపూర్ మండలం ఘన్‌పూర్ గ్రామానికి చెందిన పుర్క బాగుబాయి ఆర్‌వోఎఫ్ఆర్ పట్టా కోసం, ఎంద గ్రామానికి చెందిన రాజేశ్వర్ పాల వ్యాపారానికి, పలువురు వివిధ వాటికి దరఖాస్తులు అందజేశారు. అదనపు వైద్యాఆరోగ్య శాఖ అధికారి కుము రం బాలు, ఏపీవో పీవీటీజీ భాస్కర్, ఏవో రాంబాబు, జేడీఎం నాగభూషణ్, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్, డీపీవో ప్రవీణ్ పాల్గొన్నారు.

## కోతిదాడిలో ఒకరికి గాయాలు

**ఖానాపూర్:** కోతిదాడిలో పట్టణంలోని పద్మావతినగర్ కాలనీకి చెందిన దుర్గం లక్ష్మీపతిగౌడ్‌కు గాయాలైన సంఘటన సోమవారం ఆలస్యంగా వెలుగుచూసింది. మూడు రోజుల క్రితం ఇంటి సమీపంలోని గల్లీలో కోతి దాడిలో గాయాలైన క్షతగాత్రుడిని స్థానికులు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీంతో తీవ్రనొప్పులతో బాధపడుతున్న లక్ష్మీపతిగౌడ్‌ను పరిశీలించిన వైద్యులు భుజం వద్ద ఎముక విరిగిందని తెలిపారు. జనావాసాల్లోకి ప్రతి రోజు వస్తున్న కోతులతో నానా ఇక్కట్లు పడుతున్నామని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### బాలికపై అత్యాచారానికి యత్నించిన ఒకరిపై కేసు

**కాగజ్‌నగర్‌రూరల్:** మండలంలోని నజ్రూల్‌నగర్ విలేజ్ నెం.5 గ్రామానికి చెందిన పద్నాలుగేళ్ల బాలికపై అత్యాచారానికి యత్నించిన ఓ యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఈజ్‌గాం ఎస్సై జగదీశ్ తెలిపారు. చింతలమానెపల్లి మండలంలోని రవీంద్రనగర్ గ్రామానికి చెందిన సంజయ్ బిశ్వాస్ విలేజ్ నెం.5లోని బంధువుల ఇంటికి వచ్చాడు. ఎదురింట్లో ఒంటరిగా ఉన్న బాలికపై అత్యాచారానికి యత్నించాడు. బాలిక అరవడంతో చుట్టుపక్కల వారు రావడాన్ని గమనించిన సంజయ్ పరారయ్యాడు. ఈమేరకు బాలిక తల్లి బిషుకా మాలిక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై తెలిపారు.

# ప్రాణాలు తీసిన రహదారులు

**రోడ్డు ప్రమాదాలతో పలువురి ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. పలువురు విగతజీవులుగా మారుతున్నారు. సోమవారం ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలోని వేర్వేరు చోట్ల చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృత్యువాతపడ్డారు. పలువురు తీవ్ర గాయాలతో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఇందులో ఆగి ఉన్న లారీని బైక్‌తో ఢీకొని సర్పంచ్ మృతిచెందగా, ఆటో, లారీ ఢీకొన్న ఘటనలో కూలీ మృత్యువాత పడ్డాడు. మరో ఐదుగురు కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. అలాగే ట్రాక్టర్ ఢీకొని మరో కూలీ ప్రాణాలొదిలాడు.**

- వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి
- పలువురికి తీవ్ర గాయాలు
- ఇందులో పొన్నారి సర్పంచ్, మరో ఇద్దరు కూలీలు..

### ఆటో, లారీ ఢీ.. ఒకరి మృతి


సంఘటన స్థలంలో క్షతగాత్రుడు

**తలమడుగు:** అంతర్రాష్ట్ర రహదారిపై ఆటో, లారీ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందగా ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన తలమడుగు మండలంలోని కొడథ్ గ్రామ సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గుడిహత్నూర్ మండలంలోని శాంతపూర్ గ్రామానికి చెందిన హమాలీ కూలీలు దిపాక్, పరమేశ్వర్, గోపాల్, ప్రతాప్‌సింగ్, మాదవ్, సతీష్, బాబురావులు ఆటోలో తలమడుగు మండలంలోని కొడథ్ గ్రామానికి బయలుదేరారు. కొడథ్ గ్రామ సమీపంలో మహారాష్ట్ర నుంచి ఎదురుగా వచ్చి లారీ ఆటోను ఢీకొంది. ఆటోలని కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని 108లో ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమించి బాబురావు (55) ఆస్పత్రిలో మృతిచెందాడు. పరమేశ్వర్, సతీశ్‌ల పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అప్పారావు తెలిపారు.

### ఇసుక ట్రాక్టర్ ఢీకొని..


సోఫియాన్ మృతదేహం

**మామడ:** ట్రాక్టర్ ఢీకొని యువకుడు మృతిచెందిన సంఘటన మండల కేంద్రంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... మండల కేంద్రానికి చెందిన అబ్బు సోఫియాన్ (19) అతిక్‌కు చెందిన ట్రాక్టర్‌పై కూలీ పనులకు వెళ్లేవాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి సోఫియాన్‌ను పనులకు రావాలని అతిక్ అతడి ఇంటికి వద్దకు వెళ్లాడు. ఇరువురు కలిసి బైక్‌పై బయలుదేరారు. అతిక్‌కు చెందిన ఇసుక ట్రాక్టర్‌ను డ్రైవర్ సమీర్‌ను తీసుకుని తమ వెనక రావాలని చెప్పాడు. మామడ నుంచి రాయదారి వైపు వెళ్తుండగా డ్రైవర్ సమీర్ ట్రాక్టర్‌ను అజాగ్రత్తగా నడిపి ముందు వెళ్తున్న బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బైక్‌పై వెనుక కూర్చున్న సోఫియాన్ తలకు బలమైన గాయమై మృతి చెందాడు. అతిక్ సైతం తీవ్రంగా గాయపడ్డాడు. సోఫియాన్ తల్లి రఫియాబేగం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

### ఆగివున్న లారీని ఢీకొని పొన్నారి సర్పంచ్ దుర్మరణం


సంజీవ్‌రెడ్డి (ఫైల్)


సంజీవ్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు

**తాంసి:** మండలంలోని పొన్నారి గ్రామాన్ని ఆదర్శంగా నిలిపిన ఆ గ్రామ సర్పంచ్ చింతలపెల్లి సంజీవ్‌రెడ్డి (71) సోమవారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని చాందా(టి) గ్రామ సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడు. స్థానికుల వివరాల ప్రకారం... సంజీవ్‌రెడ్డి బంధువుల పెళ్లికి హాజరయ్యేందుకు బైక్‌పై ఆదిలాబాద్ రూరల్ మండలంలోని చాందా(టి) సమీపంలోని ఓ గార్డెన్‌కు బయలుదేరాడు. బైపాస్ రోడ్డుపై వెళ్తున్న క్రమంలో రోడ్డుపై మరమ్మతుల కోసం నిలిపిఉన్న లారీని వెనక నుంచి బైక్‌తో ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న డీసీసీబీ చైర్మన్ భోజారెడ్డి, నాయకులు పరిశీలించి సంతాపం తెలియజేశారు. అయితే గ్రామాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన సంజీవ్‌రెడ్డి మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

**అంత్యక్రియలకు భారీగా ప్రజానీకం..**

పొన్నారి గ్రామంలో నిర్వహించిన సర్పంచ్ అంత్యక్రియల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు. బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న, జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, మాజీ ఎంపీ నగేశ్, మాజీ పాడి పరిశ్రమ చైర్మన్ లోక భూమారెడ్డి, జెడ్పీటీసీ రాజు, ఎంపీపీ మంజుల శ్రీధర్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాటు ప్రజాప్రతినిధులు పాల్గొన్ని నివాళులు అర్పించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. అలాగే మండల కేంద్రంలో సర్పంచ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


ట్యాంకు పైనుంచి వృథాగా పోతున్న నీరు

## భగీరథ నీరు వృథా..

**ఉట్నూర్‌రూరల్:** మండుటెండల్లో గిరిజన ప్రాంత ప్రజలు గుక్కెడు నీటి కోసం అల్లాడుతుంటే.. మరో వైపు అధికారుల నిర్లక్ష్యంతో గంటల తరబడి నీళ్లు వృథాగా పోతున్న దృశ్యాలు ఉట్నూర్ ఏజెన్సీ ప్రాంతంలో దర్శనమించాయి. మండల కేంద్రంలోని గుస్సాడీ గుట్టపై భగీరథ ట్యాంక్ నిండి పైనుంచి గంటల తరబడి నీళ్లు వృథాగా పోతున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారని స్థానికులు వాపోతున్నారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఇలా కొనసాగుతూనే ఉంది.

